క్లుప్తంగా

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

లింగపాలెం: ధర్మాజీగూడెం పంచాయతీలో వివిధ ప్రాంతాల్లో గుర్తించిన పైప్‌లైన్ లీకేజీలను మరమ్మతులు చేస్తున్నట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి కాలిశెట్టి స్వరాజ్యలక్ష్మి తెలిపారు. మరమ్మతులు పనులను గ్రామ సర్పంచ్ కొత్తూరు మౌనిక, కార్యదర్శి స్వరాజ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. గ్రామస్తులకు తాగు నీటికి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయి నాణ్యతతో లీకేజీ మరమ్మతులు చేయిస్తున్నట్టు వారు చెప్పారు.

అంగన్‌వాడీల కమిటీ ఏర్పాటు



'కిశోర వికాసం'లో పాల్గొన్న అంగన్‌వాడీలు

బుట్టాయగూడెం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించేలా కృషి చేయాలని సర్పంచ్ కుంజా దుర్గమ్మ అన్నారు. బుట్టాయగూడెం మండలం కొవ్వాడలో బుధవారం కిశోర వికాస కార్యక్రమం నిర్వహించారు. దుర్గమ్మ మాట్లాడుతూ పౌష్టికాహార ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్ ఎస్‌వీ సత్యవతి మాట్లాడుతూ కొవ్వాడ అంగన్‌వాడీ పరిధిలో 11 మందితో కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. వీరు డ్రాప్‌ఔట్ పిల్లలను బడిలో చేర్పించడం, అక్రమ రవాణా, బాల్య వివాహాలు తదితర అంశాలపై పనిచేస్తారని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ చంద్రశేఖర్, మహిళా కానిస్టేబుల్ వి.శ్రీదేవి, ఏఎన్ఎం కె.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పిల్లలను బడిలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

లింగపాలెం: నాణ్యమైన విద్య కోసం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ధర్మాజీగూడెం బత్రాజుల పేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.గస్పర్ తల్లిదండ్రులను కోరారు. బుధవారం హెచ్ఎం ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఐదేళ్లు నిండిన పిల్లల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగు, బెల్టు, షూ నాణ్యమైన భోజనం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని చంద్రు జ్యోతి, సీఆర్ఎంటీ కుమార్ మంగళం, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ మాయ వెంకట సత్యనారాయణ, అంగన్‌వాడి టీచర్ నిర్మల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్షలు

ద్వారకాతిరుమల: గురుకులాల్లో ప్రవేశానికి ఈనెల 13న పరీక్ష నిర్వహించనున్నట్టు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఆరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థినులు పరీక్షా కేంద్రానికి గంటల ముందే చేరుకోవాలని తెలిపారు.

గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



విస్తరాకుల తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: వన్‌ధన్ వికాస కేంద్రాలు గిరిజనుల ఆర్థికాభివృద్ధిలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తాయని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. మంగయ్యపాలెంలో సౌభాగ్యదుర్గ అడ్డాకుల ప్రోసెస్సింగ్ యూనిట్‌ను పీఓ బుధవారం పరిశీలించారు. అడ్డాకుల తయారీ విధానాన్ని పరిశీలించారు. అడ్డాకుల సేకరణ, తయారు చేసే విధానాన్ని మహిళలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన మహిళా సంఘాలను క్లస్టర్‌లుగా ఏర్పాటు చేసి అటవీ ఉత్పత్తుల ప్రోసెస్సింగ్‌ను చేపట్టి, వాటి ద్వారా తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కలిగించేలా కృషి చేస్తామని పీఓ చెప్పారు. నైపుణ్యంతో విస్తర్లు తయారు చేసి అభివృద్ధి సాధించాలని సూచించారు. మహిళలు మిర్చివాడ రామలక్ష్మి, మిర్చివాడ కనకరత్నం, వెలుగు సీసీ, సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే చితి మండటం కష్టమే

- దొరసానిపాడులో బీసీ శ్మశాన వాటికలో సమస్యలు
- కనీస వసతులు కరువు
- షెడ్లు, ప్రహరీ నిర్మించాలని కోరుతున్న ప్రజలు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడు గ్రామంలో బీసీ శ్మశాన వాటికలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ఈ ఇబ్బందులు మరింత జటిలమవుతున్నాయి. గ్రామానికి చెందిన పోలుబోయిన సురేష్ (33) బుధవారం ఉదయం మృతి చెందాడు. స్థానిక శ్మశాన వాటికలో సాయంత్రం దహన సంస్కారాలు నిర్వహిస్తుండగా, వర్షం కురుస్తుండడంతో చితి మండటం కష్టతరంగా మారింది. కార్యక్రమాల నిర్వహణకు వచ్చిన బంధువులు సమీపంలోని చెట్ల కిందకు పరుగులు తీశారు. వర్షం తగ్గిన తరువాత కార్యక్రమాలను పూర్తిచేశారు. దొరసానిపాడులో బీసీలు ఎవరైనా వర్షా కాలంలో చనిపోతే, వారి ఆఖరి మజిలీలో పాల్గొనేందుకు భయపడిపోతున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి

ఇటువంటి శ్మశాన వాటికలపై ప్రభుత్వం దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రుద్ర భూములకు ప్రహరీల నిర్మాణం, దహన సంస్కారాలు, బాధితులు సేదతీరేందుకు షెడ్లు నిర్మించాలని, వాటర్ ట్యాంక్‌లు, ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



దొరసానిపాడు బీసీ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేస్తుండగా వర్షం కురవడంతో చెట్టు కిందకు చేరిన బంధువులు

ఇంకెన్నాళ్లీ కష్టాలు



శ్మశాన వాటికలో కనీస వసతులు లేవు. దీంతో వాటిలో అడుగు పెట్టాలంటేనే భయమేస్తోంది. అక్కడ కూర్చోవడానికి కూడా వీలు లేదు. ఇంకెన్నాళ్లీ ఇబ్బందులు. ఆఖరి మజిలీలోనూ ఇన్ని కష్టాలు పడాలంటే ఎలా.

– పాకనాటి బ్రహ్మయ్య, దొరసానిపాడు గ్రామస్తుడు

షెడ్లు, ప్రహరీ నిర్మించాలి



శ్మశాన వాటికలో దహన సంస్కారాలకు అవసరమయ్యే షెడ్లు, చుట్టూ ప్రహరీ నిర్మించాలి. స్నానాలు చేయడానికి వీలుగా వాటర్ ట్యాంక్, ట్యాప్‌లు ఏర్పాటు చేయాలి. వసతులు లేమి కారణంగా ఎవరైనా చనిపోతే శ్మశానానికి వెళ్లాలంటేనే భయమేస్తోంది.

– నీలపాల వెంకటేశ్వరరావు, దొరసానిపాడు, యాదవ సంఘం కుల పెద్ద

వర్షం పడితే అంతే



వర్షాకాలం ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు ఎలా చేయాలో అర్థం కావడం లేదు. చినుకు పడితే శ్మశానానికి వెళ్లలేక పోతున్నాం. కార్యక్రమం జరిగేటప్పుడు మధ్యలో వర్షం కురిస్తే చెట్ల కిందకు పరుగులు తీయాల్సి వస్తుంది.

– నీలపాల సుబ్బారావు, దొరసానిపాడు గ్రామస్తుడు

ప్రజలపై భారాలు మోపుతున్న మోదీ ప్రభుత్వం

జంగారెడ్డిగూడెం: అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపడం దుర్మార్గమని సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి సౌభాగ్య థియేటర్ సెంటర్ వరకు ప్రదర్శన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. రమణరాజు మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్, కుంచె వసంతరావు, గొలిమే బాలయేసు, లోట్టి వెంకటేశ్వరరావు, తాళ్లూరి నాగరాజు, బత్తిన పెద్ద అప్పలరాజు, చిల్లంతరాజుల శ్రీను, జగన్నాథ కృష్ణ, కొప్పిశెట్టి నూకరాజు, కట్టా సీనయ్య, జగన్నాథ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో..

చింతలపూడి : పెంచిన గ్యాస్ ధరలను తక్షణం తగ్గించాల సీపీఐ మండల కార్యదర్శి తుర్లపాటి బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. బాబు మాట్లాడుతూ కేంద్రం నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో విఫలమైందని, తాజాగా గ్యాస్ బండపై రూ.50 పెంపు ప్రజలకు భారమన్నారు. పెంచిన ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, మండల సహాయ కార్యదర్శి దొంత కృష్ణ, మండల కమిటీ సభ్యులు ఎస్‌కే కాలేషా, ఏఐవైఎఫ్ జిల్లా కోకన్వీనర్ తొర్లపాటి రాజు, ఎస్‌కే మస్తాన్, ఎస్‌కే లాల్ బి.మాణిక్యాలరావు, ఎం శ్రీనివాసరావు, ఎం వెంకటేశ్వరరావు, రామకృష్ణ ,గట్టు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్, పెట్రో ధరలు తగ్గించాలి

పోలవరం: కేంద్రం ఎల్‌పీజీ ఉజ్వల పథకం సిలిండర్లపై రూ.50 చొప్పున పెంచి సామాన్యులపై భారాలు మోపడం దుర్మార్గపు చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ విమర్శించారు. కేంద్రం పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలంటూ మండలంలోని వింజరం గ్రామ సచివాలయం వద్ద బుధవారం సిలిండర్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఇంటింటికి స్మార్ట్ మీటర్లు బిగింపు చర్యలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని రామకృష్ణ అన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ వింజరం గ్రామంలో వీధి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని సచివాలయం సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పోలోజు నాగేశ్వరావు, మండల కమిటీ సభ్యులు బొరగం భూచంద్రరావు, తామ బాలరాజు, టి.శాంతి, గోకూరి పాండవులు, కె.పోసిరత్నం, నాయకులు డి.సుబ్బయమ్మ, గోకూరి రామకృష్ణ, ఈ.వెంకటేష్, పి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడి : ఫైర్ స్టేషన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు



జంగారెడ్డిగూడెం : సౌభాగ్య థియేటర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



పోలవరం రూరల్ : వింజరంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

జంగారెడ్డిగూడెం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా అంగన్‌వాడీలు కృషిచేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి.బ్యూలా అన్నారు. జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ పరిధిలోని మూడు మండలాల్లోని అంగన్‌వాడీలతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. బ్యూలా మాట్లాడుతూ ఏప్రిల్ 8 నుంచి 22వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీల్లో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించాలన్నారు. 15 రోజులు అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను గురించి అంగన్‌వాడీలకు వివరించారు. ముఖ్యంగా జీవితంలో మొదటి 1000 రోజులు, లబ్ధిదారుల మాడ్యూల్ ప్రక్రియ విధానం, సీఎంఏఎం మాడ్యూల్ అమలు ద్వారా పోషకారా లోపాన్ని నిర్వహించడం, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవన శైలి అనే అంశాలపై దృష్టి పెట్టాలని అంగన్‌వాడీలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మేరీ మరియమ్మ, లక్ష్మీరాజ్యం, వీరకుమారి, విజయలక్ష్మి, మణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



పోషణ్ పక్వాడ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదాల్లో తాటాకిళ్లు దగ్ధం

ద్వారకాతిరుమల: మండలంలోని వేంపాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. పెండ్లి నాగేశ్వరరావు, అతని కుమారుడు రాంబాబు కుటుంబాలు రోజులానే పొలం పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి తమ ఇళ్లు దగ్ధమవుతూ కనిపించాయి. వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. భీమడోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపుచేశారు. వీఆర్వో నాగేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుల నుంచి వివరాలను సేకరించారు.

యర్రంపేటలో..

కొయ్యలగూడెం: మండలంలోని యర్రంపేట గ్రామంలో మంగళవారం రాత్రి గ్యాస్ బండ లీకవడంతో మంగమూరు నాగేశ్వరరావు, పెద్దిరాజు అనే ఇరు కుటుంబాలు రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమయ్యాయి. ఇంట్లోని సామగ్రి, రూ.30 నగదు అగ్నికి ఆహుతైందని బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంపై రెవెన్యూ అధికారులు ప్రాథమిక దర్యాప్తు చేశారు.



ద్వారకాతిరుమల : వేంపాడులో దగ్ధమైన ఇళ్లు



కొయ్యలగూడెం : యర్రంపేటలో దగ్ధమైన ఇల్లు

ఆ సిబ్బందిపై చర్యలేవి?

కుక్కునూరు : ప్రజలతో దురుసుగా వ్యవహరిస్తూ.. అవినీతికి పాల్పడుతున్న విద్యుత్ అధికారులపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి ప్రశ్నించారు. బుధవారం చిరవెల్లి గ్రామంలో యర్నం సాయికిరణ్ అధ్యక్షతన నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 11న అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న నర్సరీ యాజమాన్యం వివరాలు సేకరించే విషయమై తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన సీపీఎం నాయకుడు యర్రంశెట్టి నాగేంద్రరావు అక్కడి నుంచి విద్యుత్ అధికారులకు ఫోన్ చేయగా, ఫోన్ లిఫ్ట్ చేసిన కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావు తాను లైన్‌మెన్‌ను అంటూ నాగేంద్రరావును అవమానకరంగా మాట్లాడాడని తెలిపారు. దీంతో సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. ఏఈ పాపారావు, కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని రవి హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మండల కార్యదర్శి బుయ్యన శ్రీను,సభ్యులు మేడిపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

అన్నదాతకు తుఫాన్ నష్టం

కొయ్యలగూడెం: తుఫాన్ ప్రభావిత పంట నష్టంపై వివరాలు సేకరిస్తున్నట్టు ఏఓ చెన్నకేశవులు బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం సంభవించిన గాలివాన బీభత్సానికి సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలోని మొక్కజొన్న పంట నేలవాలిందని, 35 శాతం పంట నష్టం వాటిల్లిందని అంచనా వేశామని చెప్పారు. బోడిగూడెం గ్రామంలో జక్కు సీతామహాలక్ష్మి అనే మహిళా రైతుకు చెందిన వర్జీనియా పొగాకు బేరన్‌పై భారీ చింత చెట్టు పడడంతో ధ్వంసమైందన్నారు. రేషన్ కర్రలు క్యూరింగ్ దశలో ఉన్నాయని ప్రమాదం వల్ల రూ.2లక్షల మేర నష్టం సంభవించిందని సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, ఎంపీటీసీ తేలే శ్రీను తెలిపారు. అదేవిధంగా ఉద్యాన పంటలకు సైతం నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ చెప్పారు. రెండు రోజులలో పంటల నష్టంపై పూర్తి అంచనా వస్తుందని అధికారులు తెలిపారు.



చెట్టు పడి ధ్వంసమైన పొగాకు బేరన్



నేలకు ఒరిగిన మొక్కజొన్న పంట

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



లక్ష్మీగణపతి నవగ్రహ హోమం చేస్తున్న అర్చకులు, భక్తులు



అయ్యప్పస్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెంలో కొలువైన హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ 12వ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు గణపతిపూజ, పుణ్యాహవచనం, గోపూజ, అఖండ దీపారాధన, నవగ్రహ వాస్తు యోగిని ప్రధాన మండపారాధన, కలశస్థాపన, అగ్నిప్రతిష్టాపన, లక్ష్మీ గణపతి నవగ్రహ హోమం తదితర పూజలు నిర్వహించారు. వీరంకి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో శాశ్వత కమిటీ చైర్మన్ కేసరి రామిరెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ చామర్తి శ్రీరాములు, ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి, కార్యదర్శి గంగు జగన్‌మోహన్ రెడ్డి, కోశాధికారి కోన పార్వతి, తమ్మన వెంకటేశ్వరరావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు, గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లిపర కృష్ణారావు, రొక్కం కృష్ణారావు, పోలు మాల్యాద్రిరెడ్డి, బాకి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో బుధవారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మితో కలిసి పట్టణంలోని రూ.2.11 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్లు, బోర్ వెల్స్ తదితర 11 పనులను ప్రారంభించారు. రూ.1.38 కోట్లతో చేపట్టే మరో 11 పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్‌లు నంబూరి రాజు, కరుటూరి రమాదేవి, కాసర తులసి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రారంభోత్సవాలు

జంగారెడ్డిగూడెం మానవత సంస్థ అధ్యక్షుడు అయినాలా రమణ మూర్తి ఆధ్వర్యంలో ఫ్రీజరు బాక్స్‌లు, శాంతి రథం, అంబులెన్సు భద్రపరచడానికి దాతల సహకారంతో వేసిన షెడ్డును ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభించారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

పోలవరం రూరల్: పోలవరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలి ప్రభావానికి మామిడి, జీడిమామిడి కాయలు రాలిపోయాయి. వరి, మొక్కజొన్న చేలు కూడా విరిగి నేలమట్టమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ సిబ్బంది పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పాఠశాలలో పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మండలంలోని వేగవరం పంచాయతీ జల్లేరు కాలనీ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు బుధవారం విద్యాసామగ్రి అందజేశారు. హెచ్ఎం ఎం.మురళీమోహన్ మాట్లాడుతూ దర్భగూడెం బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) సౌజన్యంతో రూ.5 వేలు విలువైన నోటు పుస్తకాలను, ఇతర సామగ్రిని విద్యార్థులకు అందజేసినట్టు చెప్పారు. బీవోఐ బ్యాంకు మేనేజర్ షేక్ రమీజ్ రాజా, అసిస్టెంట్ మేనేజర్ లెంక సీతం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. బీవోఐ అధికారులకు హెచ్ఎం మురళీమోహన్, ఉపాధ్యాయులు వై.విజయకుమారి తదితరులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, బీవోవై సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ధ్వంసంపై కేసు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఎస్‌వీఆర్ కల్యాణ మండపం ధ్వంసంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. పట్టణ పరిధిలోని రామచంద్రాపురంలో పరిమి ధర్మరాజుకు ఎస్‌వీఆర్ కల్యాణ మండపంలో ఈ నెల 5వ తేదీ రాత్రి గుర్తుతెలియని 30 మంది వ్యక్తులు ప్రవేశించి సామగ్రిని చిందరవందర చేసి, బాత్‌రూమ్ డోర్‌లు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. సదరు దృశ్యాలను సీసీ ఫుటేజీల్లో పరిశీలించి, నిందితులపై చర్యలు తీసుకోవాలని కల్యాణ మండపం యజమాని ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెంలోని ఉప్పలమెట్టలోని గంటా అనురాధ ఇంట్లో ఫిబ్రవరి 27న బంగారు నల్లపూసలు గొలుసు 2 కాసులు, బంగారు చెవిదుద్దులు అరకాసు చోరీకి గురైందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై జబీర్ తెలిపారు. ఓ మహిళపై అనుమానం ఉన్నట్టు అనురాధ ఫిర్యాదులో పేర్కొందన్నారు.